పరీక్షల వేళ ఆరోగ్యం పదిలం

- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఒత్తిడి లేకుండా ప్రిపేర్ అవ్వాలని నిపుణుల సూచన


బీవీఆర్ఎం బాలికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థినులు

పాలకొల్లు సెంట్రల్: ఇంచుమించు నెల 15 రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సంవత్సరమంతా కష్టపడి చదివే విద్యార్థులు ప్రధాన పరీక్షల్లో ప్రతిభ చూపే సమయం దగ్గరపడుతుంది. చదివిన చదువును వచ్చే పరీక్షల్లో రాయాలంటే ముందుగా విద్యార్థులు ఒత్తిళ్లు, ఆందోళనలు లేకుండా మానసికంగా, ఆరోగ్యంగా ధృడంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. విద్యార్థుల కెరీర్‌కు పది పరీక్షలు చాలా కీలకమైనవి. ఏప్రిల్ 3 నుంచి 10 వరకూ పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు ఇప్పటికే తెల్లవారుజామున 4 గంటలకు నుంచి 6గంటల వరకూ సాయంత్రం పాఠశాలల నుంచి వచ్చిన తరువాత రాత్రి 10 గంటల వర కూ చదువుకుంటున్నారు. పాఠశాలల్లో ప్రైవేటు క్లాసుల పేరుతో రాత్రి సుమారు 8 గంటల వరకూ విద్యుర్థులతో చదివిస్తున్నారు. పాఠశాలలు, ప్రైవేటు క్లాసులే కాకుండా విద్యార్థులు ట్యూషన్ల పేరుతో చాలా బిజీ బిజీగా ఉంటున్నారు. గతంలో హిందీ తప్ప ప్రతీ సబ్జెక్టు రెండు పేపర్లు ఉండేవి. మొదటి పేపర్ సరిగ్గా రాయకపోయినా రెండో పేపర్‌కు ప్రిపేర్ కావచ్చనే భరోసా ఉండేది. కానీ ప్రస్తుతం ఒక్క పేపరే కావడంతో విద్యార్థుల్లో కొంత టెన్షన్ మొదలైంది. అందువల్ల విద్యాసంస్థల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులూ ప్రత్యేక శ్రద్ధ కనభరుస్తున్నారు. ఈ సందర్భంలో ఉపాధ్యాయులు, మానశిక నిపుణులు, వైద్యులు, పోలీసులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య ఇలా

పాలకొల్లు నియోజకవర్గంలో యలమంచిలి, పాలకొల్లు మండలం, పట్టణం, పోడూరు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఉన్న విద్యార్థుల సంఖ్య పాలకొల్లు మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 455, ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులు 243, పట్టణంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 530, ప్రైవేటు సంస్థల విద్యార్థులు 691, పోడూరు మండలంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 540, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 11, యలమంచిలి మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 581, ప్రైవేటు విద్యార్థులు 23 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 3074 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

టైమ్ మేనేజ్‌మెంట్ అవసరం



విద్యార్థులు ప్రతీ రోజూ వేకువజామున లేచి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆ సబ్జెక్టును ఎక్కువగా రివిజన్ చేస్తుండాలి. యావరేజ్ విద్యార్థులు పెద్ద ప్రశ్నలపై ఎక్కువ పోకస్ పెట్టకుండా ఒకటి రెండు మార్కులు, డయాగ్రామ్స్, మ్యాప్‌లు, నిర్మాణాలు వంటి వాటిపై ఎక్కువ దృష్టి పెడితే ఉత్తీర్ణత సాధించగలరు. పరీక్షా కాలం కేవలం 35 రోజులు మాత్రమే ఉండడం వల్ల రోజుకి రెండు ఎస్సై ప్రశ్నలు ప్రాక్టీస్ చేస్తేతే వీటిలో కూడా సులభంగా మార్కులు తెచ్చుకోవచ్చు. టైమ్ మేనేజ్‌మెంట్ (ఏ ప్రశ్న ఎన్ని నిమిషాల్లో పూర్తిచేయాలి) అలవాటు చేసుకోవాలి. దీనివల్ల చాయిస్ ప్రకారం అన్ని విభాగాల్లో పూర్తిస్థాయిలో జవాబులు రాయవచ్చు.

– వై.ప్రభాకరశాస్త్రి, హెచ్ఎం, బీవీఆర్ఎం బాలికోన్నత పాఠశాల,

నిద్ర, సాత్వికమైన ఫుడ్ ముఖ్యం.....



పరీక్షల సమయంలో ఆందోళన ఉంటుంది. దీన్ని పక్కనపెట్టి తప్పనిసరిగా ఆరు గంటలు నిద్రపోవాలి. నిద్రలో ప్రధానమైంది డీప్ స్లీప్. ఇది కనీసం 25 శాతం ఉండాలి దీనివల్ల చదివిన పాఠాలు బ్రెయిన్‌లో బాగా నిక్షిప్తమై ఉంటుంది. అలాగే పరీక్షలు అయ్యే వరకూ నాన్‌వెజ్ మానేయడం ఉత్తమం. లైట్ ఆహారం అంటే ఆకుకూరలు, పప్పు, కర్డ్ రైస్, ఫ్రూట్స్ వంటివి తీసుకోవాలి.

– సంతోష్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు, ప్రభుత్వ ఆసుపత్రి, పాలకొల్లు

పరీక్షల సమయంలో వాహనాలు ఇవ్వొద్దు



పరీక్షకు ఆలస్యమైంది మోటర్ సైకిల్ వేసుకుని వెళ్తానని విద్యార్థులు తమ తల్లిదండ్రులను అడగవచ్చు. కానీ తల్లిదండ్రులు మాత్రం వాహనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దు. విద్యార్థులకు లైసెన్స్‌లు ఉండవు వారి వయస్సు రీత్యా వాహనాలు నడిపే హక్కు కూడా లేదు. ఆలస్యమైందని వాహనాలు వేగంగా నడిపే అవకాశాలు ఉంటాయి. లేని ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దు. అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకుంటే మంచిది.

– బి.శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై, పాలకొల్లు

టీవీ, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులు ముఖ్యంగా పరీక్షల సమయంలో ఏకాగ్రతతో చదవాలి. ఏకాగ్రత కలగాలంటే విద్యార్థులు రోజూ తప్పనిసరిగా పది నిమిషాలు వ్యాయామం, పది నిమిషాలు ధ్యానం అలాగే బ్రీతింగ్ ఎక్సైర్‌సైజ్‌లు చేస్తే మానసికంగా చురుగ్గా ఉంటారు. నేను బాగా చదవగలను, నాకు బాగా గుర్తుంటుంది, బాగా రాయగలను అనే మనోధైర్యంతో ఉండాలే తప్ప సందేహంగా అస్సలు ఉండకూడదు. ఏకాగ్రతకు భంగం కలిగించే టీవీ, సెల్‌ఫోన్, సినిమాలు వంటి వాటికి దూరంగా ఉండాలి.

– ధనశేఖర్, మానసిక నిపుణులు, పాలకొల్లు

క్లుప్తంగా

నరసాపురం సబ్‌జైల్ తనిఖీ


ఖైదీలకు అందిస్తున్న ఆహారం, మంచినీటిని తనిఖీ చేస్తున్న జడ్జి శ్రీనివాస్

నరసాపురం: పట్టణంలోని సబ్‌జైలును శనివారం నరసాపురం జూనియర్ సివిల్‌జడ్జి కె.శ్రీనివాస్ తనఖీ చేశారు. జైల్లో ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. సబ్‌జైలు వాతారణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ఖైదీల ఆరోగ్యం, భోజనం విషయంలో నిభందనల మేరకు చర్యలు చేపట్టాలని జైలు అధికారులను ఆదేశించారు. జైలు అదాలత్ నిర్వహించి ఖైదీలతో మాట్లాడారు. రిమాండ్‌లో ఉండి బెయిల్ కోసం లాయర్‌ను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని వారికి మండల న్యాయసేవాధికార సంస్థ సహకారం అందిస్తుందని చెప్పారు. ఆయన వెంట ఉచిత న్యాయవాది గన్నాబత్తుల శివాజీచక్రవర్తి, సబ్‌జైలు సూరిండెంట్ టి.అప్పారావు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

నరసాపురం రూరల్: ఎల్బీచర్ల గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన సికిలే భాస్కరరావు, సికిలే ప్రసాద్ కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నాయకులు అండగా నిలిచారు. శనివారం బాధితులకు బియ్యం, వివిధ పప్పుదినుసులు, పది వేల రూపాయల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో గుబ్బల యమునాభాను, నాయకులు సంగాని బాబూరావు, వడ్డికాసులు, ఆశిష్‌కుమార్, కృష్ణమోహన్, మెంటూ మస్తాన్, ఆత్మాచైర్మన్ కడలి రాంబాబు, తిరుమాని కృష్ణంరాజు, కంకటాల పెద్దిరాజు పాల్గొన్నారు.

పంట బోదె తవ్వకం పనుల పరిశీలన

మొగల్తూరు: మండలంలోని వారతిప్ప గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ ఆర్సీ ఆనంద్ కుమార్ శనివారం పరిశీలించారు. వారతిప్ప గ్రామం నుంచి బ్రాంచ్ కాలువ వరుకు సుమారు 1500 మీటర్ల పంట బోదె తవ్వకం పనులను రూ1.50ల క్షలతో చేపట్టారు. తవ్వకం పనులను పరిశీలించిన ఆయన కూలీల మస్టర్ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ వై శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

మాంసం దుకాణదారులతో సమావేశం

పాలకొల్లు సెంట్రల్: చికెన్, మటన్ వ్యాపారస్తులు కోళ్లు, మేకల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్లపై వేయకుండా ఓ డస్ట్‌బిన్‌లో ఏర్పాటు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రి తెలిపారు. శనివారం స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాలులో చికెన్, మటన్ వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషాద్రి మాట్లాడుతూ కోళ్లు, మేకల నుండి వచ్చే వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల కుక్కలు వాటిని తిని జనాలను కరవడంతో ఎక్కువ ప్రమాదం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రేపటి నుంచి రామాలయ ప్రతిష్టాపనోత్సవాలు

నరసాపురం: కొవ్వలి ట్రస్ట్‌ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్, ఎన్ఆర్ఐ కొవ్వలి యతిరాజరామ్మోహన్‌నాయుడు తెలిపారు. సోమవారం నుంచి మార్చి 3 వరకూ జరగనున్న 120 ఏళ్ల కుమ్మరి వీధి రామాలయం పున ప్రతిష్టాపన మహోత్సవాల పోస్టర్‌ను శనివారం ప్రెస్‌క్లబ్ భవనంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు హాజరవుతారని చెప్పారు. చాగంటి కోటేశ్వర రావు లాంటి వారి ఆధ్యాత్మిక ప్రసగంగాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో పేరాల మోహన్, ఆలయ కమిటి సభ్యులు కోటిపల్లి ఆనందరావు, కోటిపల్లి బ్రహ్మానందం పాల్గొన్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేకాలంకరణ


ప్రత్యేక అలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వెంకటేశ్వరస్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

సీఎం జగన్‌కే ప్రజామద్దతు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


ఆచంటలో ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: చంద్రబాబు ఎన్ని కుటిల యత్నాలు చేసిన ప్రజలు మద్దతు ఇవ్వరని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజామద్దతు పలుకుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం ఆచంటలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించి ప్రజలకు మూడేళ్లలోఅ ందించిన సంక్షేమాన్ని వివరించి మరోసారి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. మూడేళ్లుగా పేద ప్రజలకు పారదర్శకంగా సంక్షేమాన్ని అందించడం వల్లే ప్రజల్లోకి ధైర్యంగా వెళుతున్నామన్నారు. చంద్రబాబు మాత్రం కుటిలయత్నాలు చేస్తూ రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. దీనికి వారు చేస్తున్న దుష్ప్రచారమే నిదర్శనమన్నారు. నానాటికి చంద్రబాబుకు తగ్గుతున్న ప్రజాదరణతో అలజడులు సృష్టించి ప్రభుత్వం మీదకు గెంటడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, ఉప సర్పంచ్ అడ్డాల పెద్దిరాజు, ఎంపీటీసీ ఉల్లం జ్యోతి రామానుజం, పంచాయతీ సభ్యులు గొట్టిముక్కల ఏసోబు, నిమ్మన సత్యనారాయణ, దేవస్థానంల చైర్మన్లు నెక్కంటి రామలింగేశ్వరావు, మానేపల్లి రవీంద్ర, వేమన అప్పారావు, నెక్కంటి బాలాజీ, మొల్లేటి రామకృష్ణ, కడలి నారాయణ ప్రసాద్, చిట్టి మోజేస్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ


ఆచంటలో సచివాలయంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

పెనుగొండ: రెవెన్యూ, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా సమన్వయం చేసుకోవాలని నరసాపురం సబ్ కలెక్టరు సూర్యతేజ్ అన్నారు. శనివారం ఆచంట మండలంలో ఆచంట, బాలంవారిపాలెం, ఆచంట వేమవరం, కొడమంచిలిల్లోని గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి పారుదల శాఖ ప్రణాళిక విడుదల చేసిందని, దీని ప్రకారం గ్రామాల్లో ముందుగా తాగునీటి చెరువులు నింపి ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాలంవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వైద్యులు ఇంటింటికీ వెళ్లి సేవలు అందించడంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రాజ్యలక్ష్మీ, జీవీఎల్ నాగబాబు, పుచ్చకాయల దుర్గా ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలకు పరిష్కారం


తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో సిద్ధాంతం ముస్లింలు

పెనుగొండ: నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో సిద్ధాంతం గ్రామానికి చెందిన ముస్లింలు మర్యాదపూర్వకంగా కలసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సీఎం జగన్ ముస్లింలకు ఎపుడూ అండగానే నిలుస్తారన్నారు. సిద్ధాంతంలోని ముస్లింల సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి(బాబి), గ్రామ అధ్యక్షులు జుత్తిగ దామోదర్, తిక్కిరెడ్డి పవన్ కుమార్, బండారు ప్రసాద్, పార్టీ నాయకులు కుడిపూడి సుబ్రహ్మణ్యం, గాజుల బులి పుల్లారావులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: రాజకీయ ప్రాధాన్యత లేని కులాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ అవకాశాలు కల్పించి సామాజికవాదిగా గుర్తింపు పొందారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఖండవల్లి వాసు అన్నారు. మాదిగ కులానికి చెందిన బొమ్మి ఇజ్రాయేలుకి ఎమ్మెల్సీ ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణలో శనివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వాసు మాట్లాడుతూ గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు మాదిగలకు రాజకీయంగా ఏ విధంగానూ గుర్తింపు ఇవ్వలేదన్నారు. మాదిగ దండోరా తరపున అనేక విజ్ఞప్తులు చేసినా ఫలితం దక్కలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్ని కులాలకు రాజకీయ అవకాశాలు కల్పించి సామాజిక విప్లవాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో రామాంజుల పెద మధు, పెనుమదం ఎంపీటీసీ సభ్యుడు చుట్టుగుళ్ల ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ కార్యదర్శి ముమ్మిడివరపు ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు మడికి విక్రమ్, లంక చిరంజీవి, పీటర్‌సన్ చిన్ని, ఖండవల్లి గోపి, రామాంజుల చినమధు, కనపాల మోహన్‌రావు, సిర్రా నాగరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనాన్ని రుచి చూస్తున్న జడ్జి ఉషా లక్ష్మీకుమారి

పాలకొల్లు సెంట్రల్: పాఠశాలల పరిశరాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.ఉషా లక్ష్మీకుమారి తెలిపారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం స్థానిక బీవీఆర్ఎం బాలికోన్నత పాఠశాలలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జడ్జి ఉషా లక్ష్మీకుమారి మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న బోజన పథకం ఆహారం రుచి చూశానని అంతా రుచికరంగా ఉన్నాయన్నారు. అలాగే పరిశరాలు, టాయిలెట్స్‌ను పరిశీలించానన్నారు. అన్ని సక్రమంగానే ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణతో రైతులకు లాభం


కాజ పదమరలో రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఈద అనిలకుమారి

యలమంచిలి: సామూహిక ఎలుకల నివారణతో రైతులకు అధిక లాభం కలుగుతుందని నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి చెప్పారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె మేడపాడు, కొంతేరు, కాజ పడమర గ్రామాలలో రైతులతో బ్రొమోడయోలిన్ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 96 గ్రాముల నూకలలో రెండు గ్రాముల బ్రొమోడయోలిన్, రెండు గ్రామల నూనె కలిపితే 100 గ్రాముల ఎలుకల నివారణ మందు తయారు అవుతుందన్నారు. మండలంలో ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద శనివారం వ్యవసాయ సిబ్బంది రైతులకు ఈ విధంగా తయా రుచేసిన బ్రొమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, గ్రామ వ్యవసాయ సహాయకులు మల్లుల చైతన్య, కాండ్రేకుల నాగలక్ష్మి, సీహెచ్ ఎల్‌డీ గణేష్, ఇబ్రహీం, జ్యోత్స్న, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టడం వల్ల రైతులు పంటలను కాపాడుకోవచ్చని వ్యవసాయ సంచాలకులు ఎ.పార్వతి అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రైతులకు బ్రొమోడయోలిన్ కలిపిన నూకలను రైతులకు అందజేశారు. అరట్లకట్ట రైతు భరోసా కేంద్రం వద్ద పార్వతి రైతులకు బ్రొమోడయోలిన్ కలిపిన నూకలు అందించారు. సర్పంచ్ రుద్రరాజు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యుడు చింతపల్లి సాయిబాబా, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీంపాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: ఎలుకల నిర్మూలనకు బ్రొమోడయోలిన్ మందును శనివారం రైతులకు పంపిణీ చేశారు. మొగల్తూరు 1,3,4 సచివాలయాలు, రామన్నపాలెం, కెపిపాలెం, పేరుపాలెంలో వ్యవసాయాధికారులు, ఆర్‌బీకే సిబ్బంది బ్రొమోడయోలిన్ మందును నూకలు, నూనె కలిపి 10గ్రాములగా కట్టిన పొట్లాలును రైతులకు అందించారు. కటికిరెడ్డి సత్యనారాయణ, మాణిక్యాలరావు, తులసి రావు, సూర్య చంద్ర రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఎలుకల నివారణకు రైతులు సామూహిక చర్యలు చేపట్టి సహకరించాలని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన కోరారు. శనివారం మండలంలోని పంచాయతీల్లో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని రైతులకు బ్రొమోడయోలిన్ మందు అందించారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టినట్లు మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎం జయ దుర్గామాధురి తెలిపారు. పెనుమంట్ర మండలంలో 15,031 ఎకరాలలో సామూహిక ఎలుకల నిర్మూనల కార్యక్రమం ద్వారా 61 కిలోల బ్రొమోడయోలిన్ మందును అందించామని విలేకరులకు తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుకి పుష్పగుచ్ఛం అందిస్తున్న కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటించి యువజనులు వైఎస్సార్‌సీపీ లో చురుగ్గా పని చేసేలా కృషి చేయాలని ప్రభుత్వ ఛీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన న్యాయవాది కుంచిలపల్లి వినిస్టన్‌బాబు శనివారం ప్రసాదరాజును నరసాపురంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పాలకొల్లు మండల పార్టీ కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, మండల సచివాలయాల కన్వీనర్ పార్శి వెంకటరత్నం, పార్టీ నాయకులు షేక్ చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఇళ్లు నిర్మించుకోవాలి

పోడూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక ఎంపీడీఓ ఎం.బలరామరాజు పిలుపునిచ్చారు. గుమ్మలూరు శివారు రావిగొప్పులో శనివారం అధికారులు ఇళ్లస్థలాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహంతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, మసర్పంచ్ గొట్టుముక్కల సోనియారాణి, ఎంపీటీసీలు పోతాబత్తుల శ్రీలక్ష్మి, అంబటి సుధాకర్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

పోడూరు: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు హెచ్చరించారు. పోడూరు జెడ్పీ హైస్కూల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరైన తహశీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.రాంబాబు, హెచ్ఎం ఐ.జనార్ధనరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.విజయలక్ష్మి, జి.తులసి పాల్గొన్నారు.

పుష్పరాజ్‌కు సేవారత్న అవార్డు

పెనుగొండ: మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజుల్లో పేదలకు మరిన్ని సేవలు అందించనున్నట్లు అవార్డు గ్రహీత మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ తణుకు అంబేడ్కర్ భవనంలో శనివారం ఉదయం ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు రొక్కాల నాగబుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాజీ డీఎస్పీ జాన్ కెనడీ చేతుల మీదుగా అవార్డు స్వీకరించినట్లు తెలిపారు.

శేరేపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు: మండలంలోని శేరేపాలెం గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎం.మాధురి ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో పాటు ఇంటింటికి వెళ్లి రోగులను పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది సీహెచ్ ప్రవల్లిక, సావిత్రి, రమేష్, హేమ, దుర్గ పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో కంటి పరీక్షలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాలకొల్లు రూరల్ లయన్స్ క్లబ్ సభ్యులు ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. శనివారం కళాశాలలో జరిగిన కంటి పరీక్షా శిబిరాన్ని క్లబ్ రీజనల్ చైర్మన్ కె. రామలింగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.కె మల్లేశ్వరరావు, క్లబ్ అధ్యక్షులు గూడూరి హనుమంతురావు, సెక్రటరీ నిట్టల శైలజ పాల్గొన్నారు.